కారు బోల్తా..ఇద్దరి మృతి

• మరొకరి పరిస్థితి విషమం

సాయి మేఘన(ఫైల్)

బెల్లంపల్లి, నవంబర్ 23 :కారు బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన బెల్లంపల్లిలో జరిగింది. టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం కన్నాలబస్తీకి చెందిన పారుపల్లి రాజేశ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వర్క్ ఫ్రం హోమ్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. భార్య అలేఖ్య, కుమారుడు సాయి విక్రాంత్ (14), సాయి మేఘన(9), అత్త కళ్యాణి (65)తో కలిసి భూపాల్‌పల్లిలో శుభకార్యానికి డ్రైవర్ కిరణ్‌కుమార్‌తో కారులో శుక్రవారం వెళ్లారు. శుభకార్యం ముగించుకుని అదే రోజు రాత్రి కారులో బయలు దేరారు. ఐదు నిముషాల్లో ఇంటికి చేరుకుంటారనే సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం, కారు అతి వేగంతో ఉండడంతో సెయింట్ మేరీస్ పాఠశాల సమీపంలోని బైపాస్ జాతీయ రహదారి వద్ద అర్ధరాత్రి ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో సాయి మేఘన తలకు గాయమై మెదడు బయటికి వచ్చింది. గమనించిన వాహనదారులు 108 ద్వారా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తీవ్రగాయాలపాలైన సాయిమేఘ, కల్యాణి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అలేఖ్య పరిస్థితి విషమంగా ఉండగా రాజేశ్, విక్రాంత్‌కు గాయాలై మంచిర్యాలలోని ప్రయివేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోడు భూమి కోసం చెట్ల నరికివేత

దండేపల్లి, నవంబర్ 23: దండేపల్లి మండలం లింగాపూర్ బీట్‌లోని 380 కంపార్ట్‌మెంట్‌లో శనివారం సమీప గ్రామాలకు చెందిన మహిళలు చెట్లు, పొదలను నరికారు. లింగాపూర్ బీట్‌లో చెట్లను, పొదలను మహిళలు నరుకుతున్నారని సమాచారం అందుకున్న అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులకు తెలిపారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి, లక్షెట్టిపేట ఎస్ఐలు ఉదయ్‌కిరణ్, సతీశ్ ఘటనా స్థలానికి చేరుకొని వారికి అవగాహన కల్పించారు.రాత్రి వరకు కూడా వారు ఘటనా స్థలం నుంచి వెళ్లిపోవడానికి ససేమిరా ఒప్పుకోలేదు. పోడు కోసమే గిరిజన మహిళలు మరోసారి అడవి బాట పట్టినట్లు తెలుస్తుంది.

నమస్తే తెలంగాణ CLASSIFIED
BUSINESS OFFER
★సిబిల్ స్కోర్ పెంచబడును ఇంటి పై లోన్ / ఓపెన్ ప్లాట్ లోన్ / బిజినెస్ లోన్/పర్సనల్ లోన్ పెద్దపల్లి సంప్రదించవలసిన సెల్ నెంబర్ : 9346756075
NTK-325449
సంపాదించుకోవచ్చు
★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం॥ చేతివ్రాత ద్వారా నెలకు 10 వే॥ల నుండి 15 వే॥ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.
NTK-325694
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

శ్రీరాంపూర్, నవంబర్ 23 : శ్రీరాంపూర్ ఏరియాలోని వ్యాపారులు వారి సముదాయాల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని దొంగతనాల నివారణకు సహకరించాలని సీఐ వేణుచందర్ కోరారు. శనివారం శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియా వ్యాపారులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. పార్కింగ్ స్థలం లేకుండా వ్యాపార సముదాయాలను ముందుకు పెట్టడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, పోలీసులు, వ్యాపారులున్నారు.

రోడ్డు ఆక్రమణల పరిశీలన

మంచిర్యాలటౌన్, నవంబర్ 23: మంచిర్యాలలోని మెయిన్‌రోడ్ విస్తరణ, భవనాల ముందు ఆక్రమణలను శనివారం అధికారులు, నాయకులతో కలిసి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. జనవరి 30 నుంచి రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. అనంతరం గోదావరి నది తీరాన నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ సల్ల మహేశ్, కమిషనర్ మారుతీప్రసాద్, అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం

మంచిర్యాలటౌన్, నవంబర్ 23: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసే ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు 10మంది ప్రైవేటు వ్యక్తుల ద్వారా సర్వే వివరాలను ప్రభుత్వ సైట్‌లో నమోదుచేస్తున్నారు.

కనుల పండువగా సత్య సాయిబాబా జయంతి

మంచిర్యాల అర్బన్, నవంబర్ 23: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీలో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయిబాబా 99వ జయంతిని శనివారం భక్తులు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, పాటలు పాడుతూ భజనలు, శోభాయాత్రను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు రాజకుమారి దంపతులు పాల్గొని పూజలు చేశారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

హాజీపూర్, నవంబర్ 23 : విద్యార్థులు చిన్ననాటి నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని గుడిపేటలోని మౌంట్ కార్మెల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అల్పీ అన్నారు. శనివారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులతో పాటు పీఈటీలు తదితరులున్నారు.

రూరల్ సీఐ ఆకుల అశోక్‌కు రివార్డు

సీసీసీ నస్పూర్, నవంబర్ 23: గంజాయి కేసులో పకడ్బంది దర్యాప్తు చేసి కోర్టులో నేర నిరూపణ చేసి, నిందితులకు శిక్ష పడడానికి కృషి చేసిన మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతులమీదుగా రివార్డు అందుకున్నారు. శనివారం డీజీపీ కార్యాలయంలో రివార్డు మేళా నిర్వహించారు. ఆకుల అశోక్ ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తుండగా గంజాయి సాగు చేస్తు పట్టుబడిన నిందితులకు శిక్షపడేలా కృషి చేశారు. అవార్డు రావడంపై రామగుండం సీసీ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్ అభినందించారు.

మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి

చెన్నూర్ రూరల్, నవంబర్ 23: యువకులు గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెన్నూర్ సీఐ రవీందర్ అన్నారు. చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామంలో శనివారం ఉదయం కార్టెన్ సెర్చ్ నిర్వహించారు. గంజాయి విక్రయించే అనుమానితుల ఇండ్లలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, 4 లీటర్ల గుడుంబాను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. మత్తు పదార్థాల నివారణ, సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్, కోటపల్లి ఎస్ఐలు సుబ్బారావు, రాజేందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గురుకుల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

జైపూర్, నవంబర్ 23: మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులపాఠశాల విద్యార్థులకు మంచిరాల్య లయన్స్‌క్లబ్ వారిచే శనివారం 200 ప్లేట్లు, 200 గ్లాసులు పంపిణీ చేశారు. వీటితో పాటుగా పాఠశాలకు అవసరమైన వెయ్యి లీటర్ల వాటర్ స్టోరేజి ట్యాంకు అందించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బాలమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ మధుసూదన్‌రెడ్డి, జీఎంటీలు చంద్రమోహన్‌గౌడ్, బోడ రాజమౌళి, కొత్త జయప్రకాశ్, ఏ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ప్రత్యేక ఓటరు నమోదు ముగింపు

వేమనపల్లి,నవంబర్ 23 : మండలంలో ఆదివారంతో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ముగుస్తుందని తహసీల్దార్ రమేశ్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, నవంబర్ 23 :మున్సిపాలిటీ పరిధిలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ మేనేజర్‌కు శనివారం వారు వినతి పత్రం సమర్పించారు. గత 15 రోజుల నుంచి మంచినీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చెత్తట్రాలీలు రాకపోవడంతో మెయిన్‌రోడ్డుపై చెత్త ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోతుందని తెలిపారు. ప్రజల సమస్యలను పట్టించుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు కొబ్బరికాయలు కొట్టడంలో బిజీ అయ్యారని ఆరోపించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు ఆరెపల్లి రమేశ్, సతీశ్ ఉన్నారు.

షాదీఖానా స్థలానికి హద్దులు

బెల్లంపల్లి, నవంబర్ 23: పట్టణంలోని షంషీర్‌నగర్ షాదీఖానా స్థలానికి ఎట్టకేలకు హద్దులు ఏర్పాటు చేశారు. స్థలం కబ్జాకు గురవుతుందని ఫిర్యాదులు రావడంతో అధికారులు స్పందించారు. శనివారం ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ జ్యోత్స్న ఆధ్వర్యంలో స్థలానికి హద్దులు ఏర్పాటు చేశారు. ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ షాదీఖానా స్థలంలో అన్ని సౌకర్యాలతో భవన నిర్మాణం చేపడుతామని తెలిపారు.

మామిడిగూడెంలో సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట, నవంబర్ 23 : కాసిపేట మండలంలోని మామిడిగూడెం గ్రామంలో శనివారం సీపీఎం నాయకులు పర్యటించారు. వారం రోజులుగా జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవడంతో పాటు మెడికల్ క్యాంపును సందర్శించారు. కొందరు నాయకులు అక్రమ సంపాదన కోసం ఒక్క వైపు మురుగు కాల్వలో మిషన్ భగీరథ పైపు లైన్ వేసి మొత్తం కాల్వను కాంక్రీట్ తో పూడ్చి వేశారన్నారు. రెండో వైపు ఉన్న కాలువలో మొత్తం మురుగు నీరు వెళ్ళే పరిస్థితి లేదని, దీంతో మురుగు నీరు రోడ్డుపైనే నిలిచి రోగాలు వస్తున్నాయన్నారు. అనంతరం సమస్యలను కలెక్టర్ కు ఫోన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గూడెంలో ఒకరి ఆత్మహత్యాయత్నం

దండేపల్లి, నవంబర్23: దండేపల్లి మండలంలోని గూడెం గ్రామానికి చెందిన శంకర్ ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..ఏడాది క్రితం శంకర్ కుమారుడు అనిల్ మృతికి రాజమౌళి కారణమని ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రాజమౌళి జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడు. తన కొడుకును చంపిన వ్యక్తి మళ్లీ గ్రామానికి వచ్చి బెదిరిస్తున్నాడని, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని పోలీసుల వద్ద శంకర్ వాపోయాడు. పోలీసులు విచారణ చేస్తున్న సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శంకర్‌కు న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

• జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు

న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసులు

లక్షెట్టిపేట, నవంబర్ 23; పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని న్యాయవాదులకు మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు సూచించారు. లక్షెట్టిపేట న్యాయస్థానాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా జడ్జి లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్‌తో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి న్యాయవాదులతో పలు కేసుల పరిష్కారానికి చర్చించడంతో పాటు న్యాయస్థానంలో జరుగుతున్న భవన మరమ్మతు పనులను పరిశీలించారు. న్యాయస్థానంలో న్యాయవాదులకు కావాల్సిన వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్‌కుమార్, ఏజీపీ వేల్పుల సత్యం, న్యాయవాదులు నేరెళ్ల రాజేశ్వర్, కారుకూరి సురేందర్, గాండ్ల సత్యనారాయణ, నళిని కాంత్, కొమిరెడ్డి సత్తన్న, ఉమారాణి, సజని, శివశంకర్, తాజొద్దీన్, గణేశ్‌తో పాటు ఆర్ అండ్ ఆర్ డీఈ, ఏఈ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి..

దండేపల్లి, నవంబర్ 23: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్ అన్నారు. దండేపల్లి మండలంలోని నంబాల గ్రామంలో శనివారం లక్షెట్టిపేట కోర్టు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కల్పించేందుకు మారుమూల గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పలు చట్టాలు, నేరాలు, శిక్షలపై వివరించారు.వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఏవో అంజిత్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్, ఎస్ఐ ఉదయ్‌కిరణ్, ఏఈవో అర్చన, జీపీ కార్యదర్శి రమేశ్, మాజీ సర్పంచ్ పుష్పలత, న్యాయవాదులు ఉన్నారు.

ఓటరు నమోదులో పొరపాట్లు లేకుండా చూడాలి

• కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా


ఓటరుజాబితా వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, నవంబర్ 23: ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్ నగర్‌లోని విలేజ్ నంబర్-12, గన్నారంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గన్నారం మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయాన్ని తనిఖీ చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని, పరసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ కిరణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

గూడెంలో భక్తుల సందడి

దండేపల్లి, నవంబర్23 : కార్తీక మాసం సందర్భంగా గూడెం రమాసహిత ఆలయంలో శనివారం భక్తుల సందడి కనిపించింది. గోదావరి తీరంలో, గుట్టపై భాగంలో ధ్వజ స్తంభం వద్ద, గుట్ట కింద భాగంలో రావి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. పలువురు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అయ్యప్ప ఆలయంలో సుమారు 150 మందికి పైగా అయ్యప్ప దీక్షాపరులు మాలా ధారణ స్వీకరించారు.

నేడు సీఎస్ఐ చర్చి 50వ వార్షికోత్సవం

మందమర్రి, నవంబర్ 23: మందమర్రి పట్టణంలోని సీఎస్ఐ చర్చి 50వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చర్చి ఆవరణలో నిర్వహించే వేడుకలు, కార్యక్రమలకు పెద్ద సంఖ్యలో భక్తులు రానుండడంతో ఏర్పాట్లు చేసినట్లు చర్చి పాస్టర్ రెవ జర్మియా తెలిపారు.

'మాబ్ ఆపరేషన్'పై మాక్ డ్రిల్

మంచిర్యాల అర్బన్, నవంబర్ 23: అక్రమంగా గుమిగూడిన జన సమూహాలను నియంత్రించడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, ఇతర విధ్వంసాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతలను కాపాడేందుకు 'మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్' నిర్వహిస్తున్నట్లు ఏఆర్ఏసీపీ సుందర్ రావు అన్నారు. శనివారం రామగుండం కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్లో సివిల్ ఏఆర్ పోలీసులకు మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు.

బెల్లంపల్లి, నవంబర్ 23 : బెల్లంపల్లి ఏఆర్‌హెడ్ క్వార్టర్స్‌లో బెల్లంపల్లి ఆర్ఐ అడ్మిన్ వామన మూర్తి ఆధ్వర్యంలో శనివారం బెల్లంపల్లి, మంచిర్యాల, జైపూర్ సబ్ డివిజన్ సివిల్, ఏఆర్ పోలీసులకు మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్ చేయించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, చెన్నూర్ సీఐలు ప్రమోద్‌రావు, రవీందర్, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ సబ్‌డివిజన్ ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు

అదనపు కలెక్టర్ మోతీలాల్

భీమారం, నవంబర్ 23 : దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ సూచించారు. భీమారం మండలంలోని బూర్గుపల్లి, సుంకరిపల్లి, పోలంపల్లి పోతన్‌పల్లి వరిధాన్యం కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. నిర్వాహకులు, రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సదానందం తదితరులున్నారు.

ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవాలు చేయాలి : డీఎంహెచ్‌వో

జైపూర్, నవంబర్ 23: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు చేయాలని జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ సూచించారు. శనివారం మండలంలోని కుందారం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓపీ రిజిస్టర్‌లను పరిశీలించారు. వ్యాక్సినేషన్‌పై పలు సూచనలు చేశారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని టేకుమట్లలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రావ్య, సత్యనారాయణ, జిల్లా మాస్‌మీడియా అధికారి వెంకటేశ్వర్లు, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

పఠన సామర్థ్యం పెంపొందించాలి

వేమనపల్లి, నవంబర్ 23 : విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని నీల్వాయి ఎంపీపీ ఎస్‌పాఠశాలలో రూమ్ టూ రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, ఎస్‌వో చౌదరి, పీఎస్ హెచ్ఎం మదుకర్, రూమ్ టూ రీడ్ ఎల్ఎఫ్ సుచరిత, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, తల్లిదండ్రులున్నారు.

మెరుగైన వైద్యమందించాలి

చెన్నూర్, నవంబర్ 23 : ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యమందించాలని జిల్లా కో ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధికారి (డీసీహెచ్ఎస్) కోటేశ్వర్‌రావు అన్నారు. శనివారం చెన్నూర్‌లోని ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. పలు వార్డులను తిరిగి రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఆయన వెంట దవాఖాన సూపరింటెండెంట్ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ జన్మదిన వేడుకలు

జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జూర్, నవంబర్ 23 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి పిల్లలకు పంపిణీ చేశారు. అనంతరం కాగజ్‌నగర్‌లో జరిగే ఆర్ఎస్పీ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో మొహ్మద్ ఖాజా మోహినుద్దీన్, బురుసు సారయ్య, దుర్గం తిరుపతి, రౌతు బాబురావు, రాజలింగు తదితరులున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

• మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, నవంబర్ 23; ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఉపాధ్యాయులను ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ కస్తూర్బా గాంధీ పాఠశాలను కలెక్టర్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజూ మంచి పోషక విలువలున్న ఆహారం సకాలంలో అందించాలన్నారు. భోజనం తయారీలో మంచి తాజా కూరగాయలతో పాటు నాణ్యమైన సామగ్రిని వినియోగించాలని ఆదేశించారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించాలన్నారు. అనంతరం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి కుటుంబ సర్వే వివరాలను నమోదును పరిశీలించారు. ఈకార్యక్రమంలో కస్తూర్బాగాంధీ ప్రిన్సిపాల్ కవితతో పాటు ఉపాధ్యాయులు, ఎంపీవో ఉన్నారు.

హాజీపూర్ కస్తూర్బాలో తనిఖీ..

హాజీపూర్, నవంబర్ 23 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మండలం ప్రజా పరిషత్ కార్యాలయాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్‌తో కలిసి సర్వే వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

కోటపల్లి, నవంబర్ 23 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విధులను ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని మంచిర్యాల డీఈవో యాదయ్య హెచ్చరించారు. శనివారం కోటపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, బావనపల్లి, షట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బావనపల్లి, షట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలను చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఆలస్యంగా విధులకు రాగా, ఆయన షోకాజు నోటీసులు జారీ చేశారు. సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంఈవో వెంకటేశ్వర్లు, కేజీబీవీ ఎస్‌వో హరిత ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

జైపూర్, నవంబర్ 23: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి గణపతి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలకేంద్రంలోని జైపూర్ గురుకుల పాఠశాల, కోటపల్లి గురుకుల పాఠశాల, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైపూర్ పాఠశాలలో కిచెన్ పరిసరాలను పరిశీలించి అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీవో శ్రీపతిబాపురావు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

వేమనపల్లి, నవంబర్ 23 : పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని దస్నాపూర్ ఆశ్రమ పాఠశాల, నీల్వాయి కస్తూర్బా పాఠశాలలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం వేమనపల్లిలో కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు

దండేపల్లిలో..

దండేపల్లి, నవంబర్23: దండేపల్లిల